క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం జయంతి



సీతానగరంలో సుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో డాక్టర్ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం జయంతిని నిర్వహించారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శనివారం బ్రహ్మజ్యోష్యుల సుబ్రహ్మణ్యం విగ్రహానికి ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, డాక్టర్ బొంగు రాజారావు, పెందుర్తి అచ్యుతరామారావు, డాక్టర్ సత్యం రమేష్‌బాబు తదితరులు ఖాదీ దండలు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆపిల్ పండ్లను పంచారు. ఈ కార్యక్రమంలో మట్ట వెంకటేశ్వరరావు, మట్ట తాత, గుర్రం శ్రీనివాస్, డి.పురుషోత్తం, పద్మ, రామసీత, దేవి, బాల్వాడీ పిల్లలు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సత్యవతి

పెదపూడి: మానసికస్థితి సరిగా లేక ఒక వృద్ధురాలు అదృశ్యమైనట్లు పెదపూడి ఎస్ఐ రామారావు శనివారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం దోమాడ గ్రామానికి చెందిన కాకర సత్యవతి అనే వృద్ధురాలు మానసికస్థితి బాగోక ఈ నెల 7వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుమారుడు కె.సత్తిరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామ సహాయకుడి మృతి

రంగంపేట: మండలంలోని సింగంపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్న పేరూరి జనార్ధనరావు(55) అనారోగ్యంతో మృతి చెందారని డీటీ రంజిత్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మండల వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా ఉత్సవాలు



అనపర్తిలో ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

పెదపూడి: షిరిడీ సాయిబాబా మహాసమాధి పొంది 106 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అనపర్తిలోని పాత ఊరులో సాయిబాబా ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలరాజేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుని హారతులు ఇచ్చి కీర్తనలు ఆలపించారు. అనంతరం జమ్మిచెట్టుకు భక్తులు శమీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్ శర్మ, రెడ్డి రామ్మోహన్‌రావు, సర్వలక్ష్మి, పి.దుర్గా మహాలక్ష్మి, నల్లమిల్లి వినురెడ్డి, పాందురంగారెడ్డి, కొవ్వూరి భీమేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా సమాధి ఉత్సవం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా వారి సమాధి ఉత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయ దశమి పర్వదినాన బాబా సమాధి కావడంతో ఆలయంలో బాబా వారి మూలవిరాట్ ముంగిట పుష్పాలతో నమూనా సమాధిని ఏర్పాటు చేసి, సాయి నామ స్మరణతో పుష్పాంజలి ఘటించారు. సాయిబాబా సన్నిధిలో కొలువై ఉన్న సరస్వతి మాత విగ్రహం వద్ద దసర తొమ్మిది రోజులపాటు ఉదయం, సాయంత్రం నిర్వహించిన కుంకుమార్చనలు కూడా విజయదశమితో ముగిశాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: మండలంలోని సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో మంగళవారం, గురువారం రెండు రోజులు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌కో టవర్ కండక్టర్ మార్పునకు సంబంధించి పనుల కారణంగా సంపత్‌నగరం, నామవరం, కొండగుంటూరు, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కొత్తతుంగపాడు, పాతతుంగపాడు, జి.యర్రంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మిల్లర్లు చెప్పిందే ధర

- ఒక్కసారిగా పడిపోయిన ధాన్యం రేటు
- అమ్మితే అమ్మండి.. లేదంటే లేదు..
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ప్రారంభంలోనే ఇలా ఉంటే ఎలా ..?



పొలాల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లు

రాజానగరం: ఆరుగాళం శ్రమించి పంటలు పండించే రైతన్నలకు ఆయా పంటల నుంచి ఆశించిన దిగుబడులు రావడంతోపాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పలికినప్పుడే ఆనందంగా ఉంటుంది. అయితే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర సాగులోను, పంట కోతల విషయంలోను జిల్లాలో అందరికంటే ముందుండే మండలంలోని కొన్ని గ్రామాల రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర తల్లడిల్లిపోతున్నారు. ప్రారంభంలో 75 కిలోల ధాన్యం బస్తా ధర రూ.1900 పలికింది. నాలుగు రోజుల అనంతరం ఆ ధరను ఒక్కసారిగా రూ. 1600కి పడిపోయింది. అదేమంటే మిల్లర్లు ఇదే ధర ఇస్తాం, ఇస్తే ఇవ్వండి లేకుంటే లేదంటున్నారు. ఈ తరుణంలో కోసిన పంటను పొలాల నుంచి నేరుగా కొనుగోలు చేసే ఈ అవకాశాన్ని వదులుకోలేక, తగ్గించిన ధరకు పంటను అమ్ముకోలేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగులోను, పంట కోతల్లోనూ ముందంజ

జిల్లాలో అనేక ప్రాంతాలలో ఖరీఫ్ వరి పంట పొట్ట దశలో ఉన్న ప్రస్తుత సమయంలో మండలంలోని నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద ప్రాంతాలలో నాలుగు రోజుల నుంచి వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 64,695 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో ఆది నుంచి ప్రకృతి వైపరీత్యాలతో అనేక ఒడిదొడుకులను అధిగమించి, పంటను పండిస్తున్నారు. భారీ వర్షాలతో ముంపుబారిన పడడంతో కొన్ని ప్రాంతాలలో వరి నాట్లు ఒకటికి రెండు పర్యాయాలు వేయాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. ఖర్చు పెరిగినా గాని, దిగుబడి బాగుంటుందని ఆశతో సాగును కొనసాగించారు. ఈ తరుణంలో పైన పేర్కొన్న కొన్ని ప్రాంతాలలో తక్కువ కాలవ్యవధితో కూడిన సూపర్ ఫైన్ వరి వంగడాలను నాటారు. అంతేకాక వీటిని భారీ వర్షాలకు ముందుగా నాడడంతో ముంపులను సైతం ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం పంట కోతకు రావడంతో గత నాలుగు రోజులుగా పై ప్రాంతాలలో యంత్రాల సాయంతో వరి పంట కోతలు జరుగుతున్నాయి.

మిల్లరు చెప్పిన ధరకే..

సాధారణంగా ఈ ప్రాంతంలో సీజన్ ఏదైనా ముందుగా పంట కోతలు ప్రారంభం కావొస్తున్న సమయంలో పండించిన పంటను నేరుగా మిల్లర్లే కొనుగోలు చేస్తారు. ఈ కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ప్రారంభ కాలానికి ఇక్కడ చాలా వరకు వరి పంట కోతలు పూర్తయిపోతుంటాయి. ఈ క్రమంలోనే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూడా వరి పంట కోతలు ప్రారంభం కావడం, మిల్లర్లు పొలాలకే వచ్చి, దిగుబడి కొనుగోలు చేయడం కూడా ప్రారంభమైంది. నాలుగు రోజుల క్రితం 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1900 ధర పలికింది. ఇదే గత ఏడాది రూ.1700 ఉంది. అంతకంటే ఎక్కువ ధర రావడంతోపాటు దిగుబడులు కూడా ఎకరాకు సరాసరి 30 బస్తాలు వస్తుండడంతో రైతులు ఎంతో ఆనందపడ్డారు. కానీ ఎక్కడ ఏమి జరిగిందోగానీ వారి ఆనందం మూడు రోజులు కూడా దాటలేదు. ధాన్యం కొనుగోలుదారులు ఒక్కసారిగా బస్తాకు చెల్లించే ధరను రూ.300 తగ్గించేశారు. అదేమంటే ఇస్తే ఇవ్వండి, లేకుంటే లేదంటు మొండికేస్తున్నారు. ఈ తరుణంలో ఏమి చేయాలో పాలుపోక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

గతేడాది కంటే ధర తక్కువే..



గత ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లోను రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకునేది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా సకాలంలో ఏర్పాటు చేసి, రైతులకు మేలు చేకూర్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ విధమైన విధానం కనిపించడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకునే మిల్లర్లు నాలుగు రోజుల్లోనే బస్తాకు రూ.300 ధర తగ్గించేశారు. అమ్మితే అమ్మండి లేకుంటే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రైతుల కోసం గొప్పలు చెప్పుకునే పాలకులు ఈ విషయంపై నిమ్మనీరెత్తినట్టుగా వ్యవహరించం సరైంది కాదు. తక్షణమే స్పందించి, ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి.

– దూలం పెద్ద, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రాజానగరం

కార్పొరేషన్ ఈ రకాలు తీసుకోదు



మండలంలో నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబందలలో వరి పంట ముందుగా కోతకు రావడానికి ప్రధాన కారణం ఇక్కడ రైతులు చాలా మంది తక్కువ కాల వ్యవధితో కూడిన సూపర్ ఫైన్ వరి వంగడాలను సాగు చేయడమే. ప్రస్తుతం ఇవి కోతకు రావడంతో యంత్రాలతో కోతలు కూడా జరుగుతున్నాయి. అయితే వీటికి మిల్లర్లు సరైన ధర ఇవ్వడం లేదు. అలాగని, ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ద్వారా ఈ రకాలను కొనుగోలు చేయదు. బియ్యం దిగుబడులు తక్కువగా ఉంటాయని కొనుగోలు కేంద్రాలలో వీటిని తీసుకోరు. అయినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు కొంత సమయం పడుతుంది. అప్పటికి ఈ ప్రాంతంలో వరి పంట కోతలు కూడా అయిపోతాయి.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

అమ్మవారి ఊరేగింపు



నాగరత్నం కాలనీలో అమ్మవారిని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగించారు. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారిని ఉంచి బాణసంచా కాల్పులు, కాళికాదేవి శక్తులు, అష్టలక్ష్మీదేవిలు, అఘోరాలు వివిధ వేషధారణలు, గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, బ్యాండ్‌మేళాలు, తీన్‌మార్ డప్పుల వాయిద్యాల నడుమ అమ్మవారికి ఊరేగించారు. సీతానగరం, చినకొండేపూడి, సింగవరం గ్రామాల్లో ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. ఈనెల 20న భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు

దుస్తుల పంపిణీ



కూనవరంలో వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: కూనవరం గ్రామస్తులకు ఆదివారం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మాణిక్యం దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల వరదల్లో ఇళ్లు, పొలాలు మునిగిపోయిన సంగతి తెలిసిందే. వారికి సహాయ సహకారాన్ని అందించే కార్యక్రమంలో భాగంగా ఆయన దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపదే శులు జ్ఞానేష్, బెల్లపు డేవిడ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

రాజానగరం: మండలంలో సోమవారం నుంచి 20 వరకు పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీఓ జెవి ఝాన్సీ తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ని విడుదల చేశారు. వెలుగుబంద నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం మొదటి రోజు సీతారామపురం, కలవచర్ల, నరేంద్రపురం, కొత్తతుంగపాడు, పాతతుంగపాడు, రామస్వామిపేట, పల్లకడియం, కానవరం, ఫరిజల్లిపేట, రాజానగరం, సూర్యారావుపేట, చక్రద్వారబంధంలలో జరుగునుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్), 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా గ్రామాలలో అమలు చేయనున్న అభివృద్ధి పనులపై ఈ గ్రామసభలలో చర్చించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలలోని అంబికపల్లి అగ్రహారం వద్ద ఆదివారం మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కారు, ఆటో ఒకదానిని ఒకటి తప్పించుకునే క్రమంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారు ముందు భాగం, ఆటో వెనుక భాగం రాసుకోవడంతో ఆటో తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తన కారులో బాధితులను ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదని రామచంద్రపురం పోలీసులు తెలిపారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



శిక్షణలో అత్యుత్తమ ప్రతిభను చూపిన క్యాడెట్లను అభినందిస్తున్న దృశ్యం

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబరు రెండు నుంచి నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పాన్ ఇండియా శిక్షణా కార్యక్రమం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ కమాండర్ ఆర్ఎం అగర్వాల్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ దక్షిణ ద్వీపకల్పం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 17 ఎన్‌సీసీ శాఖల నుంచి ఎంపిక చేసిన 300 మంది సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారన్నారు. జాతీయ సమైక్యతను పెంపొందించడం ఈ శిబిరం ప్రాథమిక లక్ష్యమని, దానిని చాలా వరకు చేరుకున్నామన్నారు. దేశం, రాష్ట్రం సాంస్కృతిక వారసత్వం, సాంప్రదాయాలు, సమాజా జీవన విధానం గురించి అవగాహన కలిగించడంతోపాటు జాతీయ నిర్మాణం, ఏకత్వ భావనను పెంపొందించడంలో ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో కమాండింగ్ అధికారి మేజర్ కె. మహ్మద్ ఆసీఫ్, ఏఎన్‌ఓలు, పీఐ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వెలమ జాతి ముద్దుబిడ్డ అప్పారావు



పందలపాకలో అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెలమ సంక్షేమ సంఘ నాయకులు

బిక్కవోలు: వెలమ జాతి ముద్దుబిడ్డు గొర్రిపాటి బుచ్చి అప్పారావు అని రాష్ట వెలమ సంక్షేమ సంఘం కన్వీనర్ తెంటు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని పందలపాక వెలమ కమ్యూనిటీ హాలు వద్ద బ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘం అనపర్తి, మండపేట నియోజకవర్గాల ఆధ్వర్యంలో అప్పారావు 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెంటు సత్యనారాయణ మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు స్వాతంత్ర్య సమరయోధుడిగా సేవలందించడంతో పాటు తాటిపూడి రిజర్వాయర్ సృష్టికర్త అన్నారు. 1967లో విజయనగరంలోని జామి నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గేదెల వీరబాబు, మాజీ ఎంపీటీసీ సబ్బారపు సూర్యనారాయణ, ఊలపల్లి మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, రంధ్రి అప్పారావు, వైకుంఠ వెంకటేశ్వరరావు, యాసలపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు



కొమరిపాలెంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక రాజరాజేశ్వరీ ఆలయంలోని జమ్మిచెట్టు వద్ద శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ల ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, పడాల వెంకటరెడ్డి, జగారపు జగదీష్, గొలుగూరి వెంకటరామారెడ్డి, కర్రి ఇస్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు



రావుల చెరువు గట్టున బతుకమ్మ సంబరాలు నిర్వహించిన దృశ్యం

రాజానగరం: దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక రావుల చెరువు గట్టున ఉన్న కోదండ రామాలయం వద్ద బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. తెలంగాణా రాష్ట్రంలో సంప్రదాయ పండుగగా కొలిచే ఈ ఉత్సవాన్ని ఆంధ్రాలో కూడా అదే తీరులో సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను ఏర్పాటు చేసి, వాటి చుట్టు ఆడుతూ, పాడుతూ ప్రదక్షిణలు చేశారు. ఇదే ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి, కనకదుర్గ ఆలయాల వద్ద విజయదశమి పర్వదినాన కొంతమంది మహిళలు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. దివాన్‌చెరువు, సాధూపేటలో భవానీల ఆధ్వర్యంలో 60 కలశాలతో ఊరేగింపు జరిగింది. సూర్యారావుపేటలో దేవీ కమిటీ 20వ వార్షికోత్సవాన్ని విజయదశమి రోజున సంబరంగా జరుపుకొన్నారు.

మిన్నంటిన దసరా సంబరాలు

- ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అనపర్తిలో పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో శనివారం విజయదశమి సందర్భంగా దుర్గాదేవి ఆలయాలకు భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంపర గ్రామంలో విజయదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జి.మామిడాడ, పెద్దాడ, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, కాండ్రేగుల, పుట్టకొండ తదితర గ్రామాల్లో దశమి వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అమ్మవారు రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరకుదురులో కనకదుర్గాదేవి అమ్మవారికి శనివారం చీర సారె ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధి తోటకూర శ్రీను, సానా శ్రీను, సింగినీడి నాగతిరుపతిరావు, తలాటం మురళీకృష్ణ, పాటంశెట్టి త్రిమూర్తులు, సానా రాంబాబు, వుండ్రు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: విజయదశమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు శనివారం అనపర్తిలోని వీరుళ్లమ్మ ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పడిపూజ నిర్వహించారు. వీరుళ్లమ్మ త్రిశక్తిపీఠంలో దసర ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే దంపతులు కలశస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. అనపర్తి గ్రామంలోని తురకవీధిలో దుర్గామాత అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోయిన మణికంఠతేజ, గండి ఉమా రమేష్ , కె.వెంకటరమణ, బి.వెంకటేశ్వరరావు, బండారు లోవరాజు తదితరులు పాల్గొన్నారు. రామవరం గ్రామంలో వెలిసిన దుర్గాదేవి అమ్మవారిని శనివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రామవరం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొలుగూరి గోవిందరెడ్డి, అనపర్తి మండల వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, కర్రి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లడ్డూ పాట

బిక్కవోలు: విజయదశమిని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో కొలువైన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 22 కేజీల లడ్డూను వేలం పాటలో గ్రామానికి చెందిన కర్రి కృష్ణారెడ్డి, వరలక్ష్మి దంపతులు రూ.26 వేలకు దక్కించుకున్నారు.

అమ్మవారికి సారె

రంగంపేట: మండలంలోని కొత్త కోటపాడు గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్ ఆధ్వర్యంలో శ్రీదేవి నవరాత్ర ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి వివిధ రకాల మిఠాయిలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, గాజులు తదితర సామాగ్రిని ఊరేగింపుగా సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కందర్ప భాస్కర రామలింగేశ్వర మూర్తి, రంగంపేట సబ్ జోన్ కన్వీనర్ మల్లిరెడ్డి వీర్రాజు, స్థానిక సత్య సాయి బాల వికాస్ గురువు కందర్ప భానుమతి, సేవాదళ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత, బాబా ఆలయాల్లో పూజలు

మధురపూడి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం కోరుకొండ మండలంలో కనకదుర్గమ్మ వారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బాబా సమాధి మహోత్స వాలను పురస్కరించుకొని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్న సమారాధనలు జరిగాయి. గాడాల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. గాడాల, నిడిగట్ల, మధురపూడి, రాయుడు పాకలు తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం గాడాలలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులందరూ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక సందడి ఏర్పడింది. కాపవరం రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి. ఆదివారం ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు జరిగింది. కాపవరం నుంచి కోరుకొండ వరకు ప్రధానవీధులు గుండా జరిగిన ఊరేగింపులో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అన్నవారం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమంలో దేవస్థానం అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాబా సమాధి మహోత్సవాలు

బాబావారి సమాధి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో బాబా ఓంశ్రీ సాయిరామ్ అఖండ నామ జపయజ్ఞాలు జరిగాయి. ఈ నెల 12వ తేదీన ప్రారంభ మైన ఉత్సవాలు 13, 14 తేదీల్లో జరుగుతాయి.



కరకుదురులో చీర సారె ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు



కొమరిపాలెంలో వేలం పాటలో దక్కించుకున్న లడ్డూను తీసుకెళుతున్న భక్తులు



కొత్త కోటపాడు అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు



సంపర గ్రామంలో రాజరాజేశ్వరి అవతారంలో దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు



గాడాలలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి ఊరేగింపు